కెఆర్ఆర్‌సి ఎస్‌డిసిగా కేశవ నాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

కెఆర్ఆర్‌సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డిసి)గా జి.కేశవ నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కేశవనాయుడు అనంతపురం జిల్లాలో వివిధ హెూదాల్లో పని చేశారు. బదిలీపై జిల్లా కెఆర్ఆర్‌సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌డిసి కేశవనాయుడు

జంఝావతి... మాకేటి గతి

- నీరు విడుదల చేయని అధికారులు
- ముఖం చాటేసిన వర్షాలు
- కాలువ నీరందక ఎండుతున్న భూములు
- రైతుల కంట కన్నీరు

సాగునీరు విడుదల చేయకపోవడంతో పూడికపోయిన కాలువ

సాగునీరందక ఎండిపోతున్న వరి

బాధ్యతతో మెలగాల్సిన నీటిపారుదల శాఖాధికారులు ముఖం చాటేస్తున్నారు. ఆదుకోవాల్సిన ప్రజాప్రతినిధులు సైతం మాటలతో సరిపెట్టేస్తున్నారు. ఇటు చినుకు పడక, అటు నీరు లేక బీటలు వారిన పంట భూములు, ఎండుతున్న పంటలను చూసి రైతుల గుండెలు బరువెక్కుతున్నాయి. వర్షాభావం వల్ల మండలంలోని వేలాది ఎకరాలు బీడులుగా మారాయి. ఒకటా... రెండా... మూడేళ్ల నుంచి ఇదే పరిస్థితి. జంఝావతి కాలువ పరిధిలో ఉన్నా పాలకుల నిర్లక్ష్యం వల్ల సాగునీటి దుస్థితి ఇది.

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని 2,400 ఎకరాలకు జంఝావతి సాగునీరే ప్రధానం. ఆ కాలువ నుంచి నీరొస్తేనే ఈ మొత్తం విస్తీర్ణంలో పంటలు సాగు చేయడానికి అవకాశముంటుంది. ఈ విషయం అధికారులకు సైతం ఎరుకే. నిర్దేశించిన మొత్తం 30 వేల ఎకరాలకు గానూ కేవలం పది వేల ఎకరాలకే సాగు నీరందిస్తూ చేతులు దులుపుకుంటున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు. దీంతో మిగిలిన 20 వేల ఎకరాల్లో సాగు వర్షధారంపైనే సాగుతున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిస్తే సరి. లేకుంటే పొరపాటున చినుకు ముఖం చాటేస్తే, రైతన్నలు పెట్టిన పెట్టుబడంతా బుడిదలో పోసిన పన్నీరే అవుతోంది. దీంతో జంఝావతి కాలువ కింద వ్యవసాయం చేయాలంటే రైతులు హడలెత్తిపోతున్నారు. భూమిని నమ్ముకున్న రైతన్నకు మరో ప్రత్యామ్నాయం లేక... ఏటా పెట్టుబడులు పెట్టడం... అప్పుల పాలవ్వడం పరిపాటిగా మారిపోయింది.

కాలువలో పూడికలు తొలగింపుపై నిర్లక్ష్యం...

ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు ముఖం చాటేశాయి. కురిసిన ఒకట్రెండు వర్షాలకు అప్పులు చేసి, వరి నారుమళ్లకు రైతులు సిద్ధమయ్యారు. ఉడుపులు సైతం పూర్తి చేసుకున్నారు. రెండు నెలల నుంచి వర్షాలు కురవకపోడంతో భూములు బీటలు వారుతున్నాయి. నీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా జంఝావతి అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఒత్తిడి వచ్చిన సమయంలో నీరు విడుదల చేస్తున్నా, ఆ నీరు కాలువలోనే ఇంకిపోతోంది. గుర్రపు డెక్క, ఇతర పిచ్చి మొక్కలతో కాలువలో పూడికలు పేరుకుపోయాయి. దీంతో నీరు ప్రవహించే మార్గం లేకపోవడంతో నీరింకిపోతోంది. దీనిపై రైతులు మాట్లాడుతూ, రెండేళ్ల నుంచి కాలువలో పూడికలు తొలగించలేదని ఆరోపిస్తున్నారు. కాలువ చుట్టు పక్కల ఉన్న రైతులంతా చందాలు వేసుకుని పూడికలు తొలగించినా అధికారులు మాత్రం నీరు వదలడంలేదని వారు వాపోతున్నారు.

ఎండుతున్న భూములు

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా జంఝావతి కాలువ నుంచి అధికారులు నీరు విడిచిపెట్టలేదు. ఒకవైపు వర్షాల్లేకపోవడంతో, సాగు భూములన్నీ బీటలు వారుతున్నాయి. పంటలన్నీ ఎండిపోతున్నాయి. ఇటువంటి సమయంలోనూ అధికారులు నీరు విడిచిపెట్టకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో జంఝావతి కాలువ కింద ఉల్లిభద్ర, గొట్టువలస, శివ్వాం, కొత్తూరు, రావుపల్లికి చెందిన 2,400 ఎకరాలు సాగవుతున్నాయి. అటు వర్షాల్లేక, ఇటు కాలువ నుంచి నీరు విడుదల కాకపోవడంతో ఆ 2,400 ఎకరాల్లో సాగవుతున్న పంటంతా ఎండిపోతోంది. ఇప్పటికే వేల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని, నీరులేక పంట చేతికి వచ్చే అవకాశమే లేదని రైతులు వాపోతున్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జంఝావతి కాలువ నుంచి నీరు విడుదల చేస్తే, కొద్దిపాటి పంటనైనా కాపాడుకోవొచ్చునని అన్నదాతలు వాపోతున్నారు.

మోటార్లతో నీరు

ఎండిపోతున్న పంటను రక్షించుకోడానికి అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఆర్థికంగా స్థితిమంతులైన కొందరు రైతులు మోటార్ల సాయంతో జంఝావతి కాలువలో ఉన్న నీటిని తోడుతున్నారు. మరికొంతమంది రైతులు అప్పులు చేసి ఎండిపోతున్న పైరుకు మోటారు సాయంతో నీరందిస్తున్నారు. ప్రస్తుతానికి పంటను నిలబెట్టుకుంటే, రాబోయే రోజుల్లో వర్షాలు పడకపోవా..? అని అన్నదాత ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

అప్పులే మిగిలాయి...

నాకున్న ఎకరా భూమి వరి వేశాను. అప్పు చేసి రూ.18 వేల వరకు మదుపెట్టాను. ఇప్పుడా ఆ డబ్బంతా పోయినట్లే. వర్షాల్లేవని ఎన్ని పర్యాయాలు అధికారులకు మొరపెటుకున్నా, జంఝావతి కాలువ నుంచి నీరు విడిచిపెట్టడం లేదు. ఇప్పుడు పంటంతా ఎండిపోయింది. ఏం చేయాలో తోచడం లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

లచ్చిరెడ్డి అచ్యుతరావు, రైతు, ఉల్లిభద్ర.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా అధికారులు

జెఎఎస్ రిఫరల్ కేసులను పర్యవేక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్)కు రిఫరల్ కేసుల పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రిఫరల్ కేసులు సంబంధిత ఆసుపత్రులకు చికిత్సకు వెళ్లాలని, వైద్య సిబ్బంది సరైన పర్యవేక్షణ చేసి వైద్యం పొందేలా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. రిఫరల్ ఆసుపత్రులకు వెళ్లే వారికి రూ.500 రవాణా ఛార్జీలుగా చెల్లిస్తున్నామన్నారు. అవసరం మేరకు వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సంబంధిత వైద్యులను సమన్వయం చేస్తూ ఆరోగ్య రక్షణకు సహకరించాలని పేర్కొన్నారు. జెనరిక్ మందులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి వారం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. బడి ఈడు పిల్లలెవరూ బడి బయట ఉండరాదని స్పష్టం చేశారు. నిరంతర ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు లేదా ఓపెన్ స్కూల్ విధానంలో విధిగా ఉండాలన్నారు.

15 నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

భారత ప్రభుత్వం చేపడుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఈ నెల 15న ప్రారంభమవుతుందని ప్రధాన కార్యదర్శి తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఇందులో నమోదు చేసుకోవడం ఆశయమని చెప్పారు. రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఈ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమం నిర్వహించాలని ఆయన సూచించారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష (జె.ఎ.ఎస్)కు మంచి స్పందన వస్తోందన్నారు. జిల్లాలో 2400 వరకు రిఫరల్ కేసులు వచ్చాయని, వారు చికిత్స పొందుటకు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. కంటి శస్త్ర చికిత్సలకు గుర్తించిన వారికి డిసెంబరు నాటికి శస్త్ర చికిత్సలు పూర్తి చేయుటకు షెడ్యూల్ తయారు చేశామన్నారు. జెఎఎస్ కు దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారికి ఆహారం సమకూర్చుతున్నామని, అందుకు బడ్జెట్ విడుదల చేయాలని కోరారు. జిల్లాలో ఇంకో పది వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డిఆర్ఒ జె వెంకటరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, సిపిఒ పి.వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ధ్రువపత్రాల కేసు విచారణ

ప్రజాశక్తి - సీతంపేట

బోగస్ ధ్రువపత్రాలకు సంబంధించిన కేసులను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి శనివారం విచారించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు, కేసులను ఎదుర్కొంటున్న వారిని విచారించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. మరిన్ని ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. అలాగే కేసులకు, వారి కులానికి సంబంధించిన ధ్రువపత్రాలను సంబంధిత తహశీల్దార్ ద్వారా తెప్పించాలని అధికారులకు సూచించారు. శనివారం రెండు కేసులను విచారించారు. కార్యక్రమంలో సిఐడి డిఎస్‌పి భూపాల్, ఎపిఒ రోసిరెడ్డి, తహశీల్దార్ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ దేశ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావంతో ఎండిపోయిన వరిపంటను పరిశీలిస్తున్న సిపిఎం ప్రతినిధి బృందం

పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, కురుపాంను

కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలోని పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో పూర్తిస్థాయిలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, కావున ఆ మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. అలాగే మిగిలిన మండలాల్లో పంచాయతీలు వారి కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. ఈ మేరకు శనివారం సిపిఎం బృందం పార్వతీపురం మండలం డోకిశీల రెవెన్యూ పంచాయతీలో పరిధి గల తాళ్లబురిడి, గోచెక్క తదితర గ్రామాల్లో పర్యటించింది. వర్షాభావంతో ఎండిపోయిన వరిని, పొట్ట దశకు వచ్చి పాడైపోయిన పంటను దెబ్బతిన్న పంటలను బృందం పరిశీలించింది. బుచ్చింపేట, డోకిశీల గ్రామాల రైతులు బలుసు శంకర్రావు, బలుసు రమేష్, గౌరీ శంకర్రావు పార్వతి, ఏ రాజు సాగుచేసిన వరి పంట పూర్తిగా నీరు లేక ఎండిపోయిందని తెలిపారు. ఈ ప్రాంతంలో వర్షాధారంతో వరి నాట్లు తప్ప కాలువ సౌకర్యం లేదు. దీంతో మండలంలో సుమారు 70శాతం వరి నాట్లు పంట దశకు వచ్చి దెబ్బ తిన్నాయని, తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. గతంలో సిపిఎం పరిశీలించిన గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో సగం భూమిలో వరి నాట్లు కూడా పడలేదు, నాట్లు వేసినవి కూడా ఇదే స్థాయిలో వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయి కరువుకు గురయ్యాయి. కావున ఈ మండలాలను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం పరిశీలించి పూర్తిస్థాయిలో కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని రెడ్డి వేణు డిమాండ్ చేశారు. జిల్లాలో తీవ్ర వర్షాభావంతో మిగిలిన మండలాల్లో భామిని, వీరఘట్టం, పాలకొండ, సీతానగరం, గరుగుబిల్లి తదితర మండలాల్లో పంచాయతీ స్థాయిలో వర్షాభావంతో వరి నాటుమళ్ల దెబ్బతిన్నాయన్నారు. పంచాయతీల వారి కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించి రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని, ప్రత్యామ్నాయ పంటలకు ఏర్పాట్లు చేయాలని, జిల్లాలో సాగునీటి సౌకర్యం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, జంఝావతి పూర్తి చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాములు నిర్మించి సాగునీటి వనరులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పై ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించే వరకూ సిపిఎం పోరాడుతుందని, జిల్లా రైతులంతా పోరాటం చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పరిశీలన బృందంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పి.రాము, రైతులు ఎ.రాజు, బి.రమేషు, ఎస్ బాల తదితరులు ఉన్నారు.

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వర్క్ షాప్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పాత పనుకువలస సమీపంలో ఉన్న ఎన్జీరంగా పరిశోధన కేంద్రంలో శనివారం సీనియర్ శాస్త్రవేత్త అధిపతి పి.సీతారాం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలకు ఆశిస్తున్న చీడ, పీడల తొలగింపుపై అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతులు గురించి తెలిపారు. ఏ పంటలు ఇక్కడ పండుతాయో తెలిపారు. సేంద్రియ పద్ధతులు, భూసారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు బి.శారద, ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి హరికృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు కె.రత్నకుమారి, ఎం.మధుసూదనరావు, నిర్మలజ్యోతి, వ్యవసాయాధికారి సింహాచలం, శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి, జి.అను సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రూ.1.80 లక్షలతో పూడికతీతకు ప్రతిపాదన

ప్రజాశక్తి - సాలూరు

కర్రి వలస ఆనకట్ట ఎడమ కాలువ నుంచి కొత్తవలస పాండీ చెరువుకు నీరు చేరేలా కాలువ పూడిక తీత పనులు చేపట్టడానికి రూ.1.80 లక్షలతో ప్రతిపాదన పంపించామని పెద్దగెడ్డ డిఇ కనకారావు చెప్పారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కర్రివలస ఆనకట్ట ఎడమ కాలువ నుండి కొత్తవలస పాండీ చెరువు వరకు 200మీటర్ల మేర కాలువ పూడిక తీతకు ప్రతిపాదన పంపామని చెప్పారు. అయితే కాలువ మధ్యలో ఒక రైతు కొంతమేర ఆక్రమించారని, దీనివల్ల కొంత ఆటంకం కలుగుతోందని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని డిఇ కనకారావు చెప్పారు.

జిఒ 117 అమలు చేస్తే సహించం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిఒ 117 అమలు చేస్తే సహించబోమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు టి.రమేష్ అన్నారు. శనివారం కురుపాం, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి మండలాల్లోని పలు పాఠశాలలను సందర్శించి వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం మండలంలో నేరేడువలస, తెనుఖర్జలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులతో పిల్లలు అందుతున్న విద్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గవర్నమెంట్ ప్రైమరీ పాఠశాలల్లో కనీసం బిల్డింగ్ కూడా లేదన్నారు. అలాగే 117 జీవో వల్ల హైస్కూల్లో ప్రాథమిక పాఠశాలలు కలిసిన తర్వాత డ్రాపౌట్ చాలా పెరిగాయన్నారు. నాడు-నేడు పథకం కింద లక్షలు ఖర్చుపెట్టి ప్రాథమిక పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దిగా ఆ భవనాలన్నీ పిల్లలు లేక ఖాళీగానే ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు కూడా ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారని, దీనివల్ల ప్రభుత్వ సొమ్ము నిరుపయోగంగా ఉందని తెలిపారు. అలాగే గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెనూ రేట్లు, మెనూకిచ్చే డబ్బులు చాలీచాలనివిగా ఉన్నాయని తెలిపారు. వీటిన్నింటినీ పరిశీలించామని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పాఠశాలల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ పరిశీలనలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు

14 నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుంచి వరకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి.శివకేశవరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా "భారతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పునర్వికాసానికి ప్రకృతి వ్యవసాయమే పునాది" అనే అంశంపై ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా విద్యాలయ ప్రధాన ఉపాధ్యాయులు ఈ విషయంలో సహకరించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి సంఘం అధ్యక్షులు శివకేశవరావు (7989353235), కార్యదర్శి చొక్కాపు శ్రీనివాస రావు (9441305909)కు తెలియజేయాలని ఆయన కోరారు. వివరాలకు, సందేహాలకు శ్రీనివాస రావుకు సంప్రదించ వచ్చని ఆయన పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

పాలకొండ : ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పిడి రమేష్ అన్నారు. మండలంలోని బుక్కురులో జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు చైతన్యం తీసుకు రావాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఎఇ మాధవరావు ఉన్నారు.

ఏ యాత్ర.. ఎవరి కోసం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వైసిపి సామాజిక సాధికార యాత్ర చేపట్టింది. జగనన్న మళ్లీ ఎందుకు రావాలంటూ మరో యాత్ర. అటు టిడిపి నాయకులు 'నువ్వే భవిష్యత్తు, న్యాయం గెలవాలి' అంటూ యాత్రల పరంపర సాగింది. ఇంకా మన జిల్లా వరకు సాగకపోయినా జనసేన అధినేత వారాహియాత్ర పొరుగు జిల్లాల వరకు వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో సిపిఎం కూడా గడిచిన వారంలో నాలుగు రోజులపాటు విజయనగరం ఉమ్మడి జిల్లాలో ప్రజారక్షణ భేరి పేరిట బస్సు యాత్ర చేపట్టింది. ముఖ్యంగా సామాజిక సాధికార యాత్ర పేరిట వైసిపి చేపట్టిన బస్సుయాత్రలో జనాల్ని తరలింపునకు అధికార బలాన్ని ప్రయోగించారు. అక్కడక్కడా బెదిరింపులు, బుజ్జగింపులు కూడా చోటుచేసుకున్నాయి. డబ్బు, మద్యం పంపకాలు కూడా కనిపించాయి. ఇటు టిడిపి చేపట్టిన యాత్రల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. కానీ, సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరికి జనాలు తండోపతండాలుగా వచ్చేయకున్నా, వచ్చిన వారంతా స్వచ్ఛందంగా, అకుంఠిత దీక్షతో, అంత:కరణ శుద్ధితో వచ్చారనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో గత నెల 30న ప్రారంభమైన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర కురుపాం, పార్వతీపురం, సీతానగరం మండలం చినబోగిలి, మక్కువ, సాలూరు, మెంటాడ, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలం బుడతనాపల్లి, తామరాపల్లి మీదుగా శృంగవరపుకోట మండలంలోని బొడ్డవర జంక్షన్ వరకు సాగింది. అక్కడి నుంచి అనంతగిరి మీదుగా ఈ నెల ఒకటో తేదిన అల్లూరి జిల్లాలోకి ప్రవేశించింది. శ్రీకాకుళం జిల్లా మందసలో ఈ నెల 2న ప్రారంభమైన మరో రక్షణ భేరి యాత్ర 3వ తేదీ ఉదయం 8:30 గంటలకే విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండల కేంద్రానికి చేరుకుంది. అక్కడి నుంచి విజయనగరం, భీమసింగి, జామి, ఎస్.కోట మీదుగా కొత్తవలస వరకు సాగింది. సుదీర్ఘమైన ఈ రక్షణ భేరి యాత్ర విజయవంతానికి జనాన్ని కూడగట్టడానికి వైసిపి, టిడిపి మాదిరిగా బస్సులు, ట్రక్కులు వంటి వాహనాలను సమకూర్చలేదు. బిర్యానీ, మందు వంటివి అసలే పంచలేదు. అయినా సరే ఎంతచెట్టుకు అంతగాలి అన్నట్టుగా జనాలు వచ్చారు. అదీ స్వచ్ఛందంగా, సొంత ప్రయాణ ఖర్చులతో రావడం విశేషం. ఇంకా చెప్పాలంటే సీతంపేట, కురుపాం, మక్కువలో సాగిన యాత్రలో భాగస్వామ్యమయ్యేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన గిరిశిఖర గ్రామాల గిరిజనులంతా తెల్లారక ముందే నిద్రలేచి.. కాలినడకన కొండలు, గుట్టలు దాటుకుంటూ వచ్చారు. చంకల్లో చంటిబిడ్డలు, చేతిలో సంచులు పట్టుకుని మహిళలు సైతం రావడం గమనార్హం. అధికార, ప్రతిపక్ష పార్టీలు చేపట్టిన యాత్రలో దాదాపు ఒకరినొకరు, దుమ్మెత్తుపోసుకుంటూ తీవ్ర పరుష పదజాలాలతో విమర్శలు చేసుకోవడం, లేదా గొప్పపార్టీలని తమకు తామే కితాబిచ్చుకోవడం వంటివి కనిపించాయి. ఒకరిపై ఒకరి నిందలు, ఆరోపణలు, బూతుపురాణాలతో కాలం గడిపారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య విలువలు, నిరుద్యోగం, మూతపడ్డ పరిశ్రమల గురించి ఆ పార్టీలకు చెందిన నాయకులూ స్పందించలేదు. ఈ నేపథ్యంలో పాలకపార్టీల

యాత్రలకు, సిపిఎం చేపట్టిన యాత్రకు స్పష్టమైన తేడా కనిపిస్తోంది. తేడా మాత్రమే కాదు. ఆయా పార్టీలు ప్రజల్ని ఎలా మోసం చేస్తున్నాయన్న క్లారిటీ కూడా కొంతమంది వద్ద వ్యక్తమౌతోంది. సిపిఎం నాయకులు ఒక స్పష్టమైన ప్రత్యామ్నాయ రాజకీయ వైఖరితో ముందుకొచ్చారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యం, కేటాయింపులు గణాంకాలతో బట్టబయలు చేశారు. మూతపడ్డ ఫెర్రో ఎల్లాయిస్‌ను, జ్యూట్ మిల్లులను, చక్కెర కర్మాగారాలను తెరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలు నెరవేర్చకపోవడం, దాని వల్ల మన రాష్ట్రం వెనుకబడిన తీరుతెన్నులు, తీరని అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. అలా ద్రోహం చేసిన బిజెపితో వైసిపి, టిడిపి ఎలా కుమ్మక్కు అవుతున్నాయో వివరించారు. ప్రజలపై భారాలు మోపే విద్యుత్ సంస్కరణలు, ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం వంటి ప్రజారక్షణకు దోహదపడే చట్టాలకు తూట్లుపొడిచే అంశాలపై పార్లమెంట్‌లో వైసిపి, టిడిపి సభ్యులు చేతులెత్తి మరీ బిజెపికి మద్దతు పలికిన తీరును, రాష్ట్రంలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్టుగా ఉండే వ్యవహార శైలిని కూడా ఎండగట్టారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి సిపిఎం నాయకులకు మంచి ఆదరణ లభించింది. యాత్రలో ఆగిన ప్రతిచోటా హారతి పడుతూ, తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. డప్పుల దరువులు, గిరిజన సంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో తమ నాయకుల రాకను జనానికి తెలియజేసే ప్రయత్నం చేశారు. ఈ యాత్ర వచ్చే ఎన్నికల్లో రాజకీయాలను ఏమేరకు ప్రభావితం చేస్తుందన్నది కాస్త పక్కనబెడితే, తద్వారా ఎంతో కొంతమంది అభ్యుదయ, వామపక్ష, ప్రజాతంత్ర వాదులు, సిపిఎం అభిమానులు, కార్యకర్తలు రాజకీయంగా మరింత చైతన్యవంతులై సమాజాభివృద్ధి భాగస్వామ్యం అవుతారనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

కరపత్రాలను పంపిణీచేస్తున్న సిపిఎం నాయకులు

చలో విజయవాడ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

సిపిఎం తలపెట్టిన ప్రజా రక్షణభేరి ముగింపు సందర్భంగా ఈనెల 15న తలపెట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ఆధ్వర్యాన స్థానిక ఐటిడిఎ శనివారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతల్లేని రాష్ట్ర అభివృద్ధి కోసం సిపిఎం ఇటీవలనిర్వహించిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర ముగింపు భారీ బహిరంగ సభలో విజయవాడలో ఈనెల 15న జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ప్రజలపై దాడులు పెరిగాయని, ఈ అసమానతలు పోవాలని అన్నారు. ప్రత్యామ్నాయ విధానాల కోసం ప్రజలంతా కలిసి రావాలని కోరుతూ జరగనున్న బహిరంగసభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని, కావున ప్రజలంతా ఈ బహిరంగసభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.లక్ష్మణరావు, బి. సాయి పాల్గొన్నారు.

రోడ్డు అక్రమ మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న టిడిపి, జనసేన నాయకులు

అక్రమ తవ్వకం ఆపాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో కొంకడివరంలో క్వారీ రోడ్డు మార్గం కోసం చేపడుతున్న అక్రమ తవ్వకాలు ఆపాలని తెలుగుదేశం, జనసేనపార్టీ నాయకులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జనసేన రాష్ట్ర కార్యదర్శి బాబు పాలురు, టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు, అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, జియ్యమ్మ వలస మండల పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబు, అరుకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కష్ణ బాబు, పలువురు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తక్షణమే అక్రమ తవ్వకాలు ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తోందని హెచ్చరించారు.

తానా జిల్లా సమన్వయకర్తగా దేవానంద్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)కు పార్వతీపురం మన్యం జిల్లా సమన్వయకర్తగా పాలక దేవానంద్‌ను ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించి తానా ప్రతినిధుల నుంచి సమాచారం అందినట్లు దేవానంద్ తెలిపారు. తెలుగు సాహిత్యం, సంస్కృతిని చాటి చెబుతూ ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు తానా ఆధ్వర్యంలో నవంబర్ 9 నుంచి మరో బహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో తానా అధ్యక్షులు చిగురుమళ్ల శ్రీనివాస్ వంద దేశాల్లో శాంతి సద్భావన యాత్రను రెండేళ్ల పాటు నిర్వహించను న్నారు. వంద దేశాల్లోని వందకు పైగా తెలుగు సంఘాల సంయుక్త నిర్వహణలో జరుగుతున్న మహా అక్షర యజ్ఞం యాత్ర కొనగుతుందని తెలిపారు.

నేడు ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈనెల 5న విశాఖలోని అంబేద్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘానికి ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కావున అన్ని జిల్లాల నుంచి జిల్లా, రాష్ట్ర నాయకులు అందరూ సమావేశానికి హాజరై కావాలని సామల కోరారు.

పోలీసుల సమక్షంలో ప్రయాణికురాలికి బ్యాగును అందజేస్తున్న శ్రీనివాసరావు

బ్యాగ్ అప్పగింత

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని అట్టలి గ్రామానికి చెందిన పాపమ్మ విజయవాడ నుంచి స్వగ్రామానికి శనివారం చేరుకోగా ఆటోలో వెళ్తుండగా బ్యాగు జారిపోయింది. అయితే గతంలో పాలకొండ పోలీస్ స్టేషన్లో సిపిఒగా పని చేసిన బొడ్డుమాసింగికి చెందిన శ్రీనివాసరావుకు ఆ బ్యాగు దొరికింది. ఆ బ్యాగును పోలీస్ స్టేషన్‌కు శ్రీనివాసరావు అప్పగించారు. ఆ బ్యాగులో తులం బంగారం గొలుసు, రూ.2500 నగదు ఉన్నట్లుగా గుర్తించారు. ఆ బ్యాగును పాపమ్మకు ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో అప్పగించారు. దీంతో పాపమ్మ ఆనందం వ్యక్తం చేసింది.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - సీతంపేట

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి అన్నారు. శనివారం స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వార్షిక తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వార్షిక తనిఖీ పది మంది ఉపాధ్యాయులతో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.చంద్రరావు, డిప్యూటీ వార్డెను గాశయ్య, ఉపాధ్యాయులు సూరిబాబు, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి

విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణానికి

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి -కొమరాడ

బంద్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు

విశాఖ ఉక్కు పరిరక్షణకై, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం చేయాలని కోరుతూ కేజీ టు పీజీ వరకు నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాలు చేపట్టే విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బంద్‌కు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు, హెచ్.సింహాచలం మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాటానికి నవంబర్ 8నాటికి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాలు నిరసనలు చేపడుతున్నాయన్నారు. 32 మంది కార్మికులు, యువకులు ప్రాణత్యాగం ప్రతిఫలం ఒక పరిశ్రమలను దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన పరిశ్రమ విశాఖ ఉక్కు పరిశ్రమ అని అన్నారు. ఇటువంటి పరిశ్రమకు తప్పుడు లెక్కలతో నష్టాన్ని చూపించి ప్రైవేట్ పరం చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న బిజెపి విధానం రాష్ట్ర ప్రజల పట్ల, దేశానికి ద్రోహం చేపట్టడమేనని విమర్శించారు. నేడు మూడు లక్షల కోట్లు విలువ చేసే ఆస్తులతో లక్షల మందికి ఉపాధిని కల్పిస్తూ విశాఖపట్నం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్ ను కారుచౌకగా తమ అనుయాయులైన అదానీ, అంబానీలకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రను విద్యార్థి, యువజన సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. రాష్ట్రానికే వెన్నుముక్కగా నిలిచిన ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని బిజెపి ప్రభుత్వం ఉపసహరించుకోవాలని, ఉక్కు కార్మిక సంఘాలు వెయ్యి రోజులుగా దీక్షలు చేపడుతున్నప్పటికీ మోడీ స్పందించకపోవడం దుర్మార్గమని, పైగా కార్పొరేట్లకు అనేక ఆంక్షలతో దొడ్డి దారిన పరిశ్రమ మూతబడడానికి అనేక ప్రత్యామ్నాలు చేపడుతుండడం చాలా అన్యాయమని మండిపడ్డారు. ఎన్నికల్లో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మోడీ, పూర్తిగా మరిచారని ఇటువంటి మోడీ నిర్ణయాల వల్ల రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్న రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన నాయకులు కనీసం స్పందించకపోవడం చాలా దుర్మార్గమని, కేవలం అధికార లాభాపేక్ష కోసం మోడీ నీడలో చేరి ముసలి కన్నీళ్ళు, గారడి మాటలు చేపడుతున్నారని వాపోయారు. కావున ఇకనైనా మోడీ మోసపూరిత వైఖరిని గమనించి రాష్ట్ర స్వప్రయోజనాల కోసం విద్యార్థి, యువజన సంఘాలు చేపడుతున్న బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. బిజెపి మోడీ రాష్ట్రానికి చేసిన మోసాన్ని ద్రోహాన్ని విస్తృతంగా అన్ని విద్యాసంస్థలకు, విద్యార్థుల వద్దకు ఈ బందు పిలుపు చేరుతుందని, ఈ బంద్ జయప్రదంకై విద్యాసంస్థ యాజమాన్యం, మేధావులు, అభ్యుదయవాదులు స్పందించి స్వచ్ఛందంగా బంద్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దినేష్, ప్రవీణ్, కిరణ్, సందీప్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మ వలస మండల కేంద్రంలో నివాసముంటున్న కర్ని సత్యంకు ఈనెల వృద్ధాప్య పెన్షన్ అధికారులు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, మండల కార్యదర్శి కూరంగి సీతారాం కోరారు. సత్యం మానసిక వికలాంగుడని, అయితే వికలాంగ ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో నెలా నెలా వృద్ధాప్య పెన్షన్ వచ్చేదని అన్నారు. గత ఐదు నెలలగా పెన్షన్ నిలిపివేయడంతో గత నెల మండలంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తామనడంతో పింఛను అందించారని తెలిపారు. మళ్లీ ఈనెల పింఛన్ ఇవ్వలేదని నాయకులు తెలిపారు. వృద్ధుడైన సత్యంకు ప్రతినెలా పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

10 న సామాజిక సాధికార యాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 10న శుక్రవారం సామాజిక సాధికార యాత్ర నిర్వహించాలని పార్టీ ప్రతినిధులు ఆదేశాల జారీ చేశారని శనివారం నాడు సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలియపరిచారు. ఈ కార్యక్రమం అత్యంత విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు అంతా కూడా పెద్ద యెత్తున సిద్దం కావాలని ఎమ్మెల్యే పిలుపును ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రదర్శించాలి : పిఒ

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 4, 5 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా ప్రతి పోలింగ్ స్టేషన్లో సంబంధిత ఓటర్ల జాబితాను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. శనివారం పాలకొండ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న 167 పోలింగ్ కేంద్రాన్ని, ఆర్సీఎం పాఠశాలలో ఉన్న 168 పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదుకు వస్తే వెంటనే వారి నుంచి దరఖాస్తు తీసుకోవాలన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ రెండు రోజులు బిఎల్ఒలు విధిగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాలన్నారు. కార్యక్రమంలో పలువురు బిఎల్ఒలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని 27 పంచాయతీల్లో ఓటర్లు నమోదు ప్రక్రియ జోరుగా సాగుతుంది. కొత్త ఓటర్లను నమోదు చేయడం, పాత ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపు ప్రక్రియలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని అధికారులు కోరారు. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో శనివారం ఓటర్ల చేర్పులు, మార్పుల ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి గౌరీ శంకర్రావు ఉన్నారు.

పాలకొండలో బిఎల్ఒలతో మాట్లాడుతున్న పిఒ కల్పనకుమారి

మాట తప్పడం సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి -కొమరాడ

జీడి పిక్కల ఫ్యాక్టరీ విషయంలో ఎపిడి ఇచ్చిన మాట తప్పడం సరికాదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గిరిజనులకు జీడి పిక్కలు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని వచ్చి స్థల పరిశీలన చేసినా నేటికీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. కేవలం పత్రిక ప్రకటనలకే తప్ప జీడి ఫ్యాక్టరీ విషయంలో ఒక్క అడుగు ముందుకు వెళ్లని పరిస్థితి ఉందన్నారు. కేవలం కలెక్టర్‌కు, ఐటిడిఎ పిఒకు నివేదికలు ఇవ్వడమే తప్ప కేంద్రం నుండి వచ్చిన నిధులు ఖర్చు పెట్టడంలోనూ ఆ నిధులు మహిళా సంఘాలకు ఇవ్వడంలోనూ ముందుకు వెళ్లని పరిస్థితి కనిపిస్తుందని అన్నారు. వెంటనే కొమరాడలో జీడీ ఫ్యాక్టరీ ప్రారంభించి గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించేలా జీడి పిక్కలను కొనుగోలు చేయాలని కోరారు.

చెరువులో చేపలు విడిచిపెడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - పాలకొండ

చేపల పెంపకం ద్వారా గిరిజనులు మరింత ఆర్థికంగా అభివృద్ధి కావాలని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గిరిజన మత్స్యకారులకు ఐటిడిఎ ప్రత్యేక కేంద్ర సహాయ నిధులు గిరిజన ఉపప్రణాళికలో భాగంగా శనివారం స్థానిక నగర పంచాయతీ పరిధిలో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి చెరువులులోకి విడిచి పెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం గిరిజన మత్స్యకారులకు ఎంతో దోహదపడుతుందని, కావున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధకుమారి, జిల్లా మత్స్యకారు అధికారి తిరుపతయ్య, పిహెచ్ఒ గణేష్, ఎఫ్‌డిఒ గోపీకృష్ణ, కౌన్సిలర్ల వెల్లవల మన్మధరావు, కడగల రమణ ఉన్నారు.

సీతంపేట : ఎస్టీ ఫిషర్స్‌కు స్థానిక ఐటిడిఎ ప్రత్యేక కేంద్ర సహాయ నిధులు గిరిజన ఉప ప్రణాళిక పథకం ద్వారా సీడ్ స్టాకింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా మండలంలోని లోకొత్తవలస, వాబ, కుసిమి, గోయిది పంచాయతీలు చెందిన చెరువుల్లో 42వేల 200చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, విఎఫ్ఎ విజేత తదితరులు, గిరిజన మత్స్యకారులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలెక్కడ?

ప్రజాశక్తి - సాలూరురూరల్

అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తామని, అందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, మద్దతు ధర ఇస్తామని వైసిపి ఉత్తుత్తి ప్రకటనలకే తప్ప నిజంగా కొనుగోలు కేంద్రాలు ఎక్కడా మచ్చుకైనా ఎక్కడా కనిపించడం లేదని సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు. మండలంలోని తోణాం, మెట్టవలస గ్రామాల్లో శనివారం బాబు ష్యూర్టీ భవిష్యత్తుకు గ్యారెంటీ అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ గడపగడపకు తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గిరిజనులకు ట్రైకార్ రుణాలు, వివిధ రకాల పథకాల పేర్లతో లబ్ధి చేకూరిందన్నారు. అందులో కనీసం 10శాతం అయినా వైసిపి ప్రభుత్వంలో అందడం లేదన్నారు. గిరిజనులు తమ బాధలు చెప్పుకోవడానికి ఐటిడిఎ కార్యాలయం ఉండేదని, ఆ కార్యాలయానికి వెళ్లి గిరిజనులు వారి బాధలను చెప్పుకునే వారని, తగు సమయంలో పై అధికారులు వారి సమస్యలను తీర్చే వారిని, కానీ ఇప్పుడు అసలు ఐటిడిఎలో ఎవరు వున్నారో? ఎప్పుడు వస్తున్నారో? ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. దొంగ మద్యంతో వేలకోట్లు సంపాదిస్తున్న జగన్ మద్యం అక్రమాలు జరిగాయని, గతంలో చంద్రబాబు ఇసుకను ఉచితంగా ఇస్తే ఇసుక ద్వారా అక్రమాలు జరిగాయని చంద్రబాబుపై కేసులు పెడుతున్నారని, దీన్ని ప్రజలంతా గమనించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, యుగంధర్, భాస్కరరావు, రజిని, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు ఆధ్వర్యాన మండలంలోని చిన్నబగ్గ, కీసరజోడు, మర్రిపాడు, పూతికవలస, ఈతమానుగూడ పంచాయతీల్లో బాబు ష్యూర్టీ భవిష్యత్తు గ్యారెంటీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, చంద్రబాబు విడుదల చేసిన మినీ మేనిఫేస్టోలోని అంశాలపై ప్రజల్లో చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం, బీసీ సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాథం, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంట సుధ, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఐటీడీపి కోఆర్డినేటర్ హిమరక పవన్, ప్రచార కర్త తోయిక సంధ్యారాణి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : కీసరజోడులో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం పిటి మండ పంచాయతీ పల్లపు సిరిపి, నడిమి సిరిపి గ్రామాల్లో బాబు ష్యూర్టీ- భవిష్యత్తు గ్యారెంటీ" కార్యక్రమం కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, అరుకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, క్లస్టర్ 6 జోగి భుజింగరావు, పంచాయతీ సర్పంచ్ ఆరిక చలపతి, టికె జమ్ము పంచాయతీ సర్పంచ్ అడ్డాకుల సుందరరావురావు, పలువురు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మృతి చెందిన మేకపిల్లలను పరిశీలిస్తున్న జగదీశ్వరి, నాయకులు

ఆర్థికంగా ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో కుక్కల దాడిలో 15 మేక పిల్లలు శుక్రవారం చనిపోయిన సంఘటన తెలుసుకుని కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి టి. జగదీశ్వరి పెంపకందారు చిన్ని మహాలక్ష్మమ్మను పరామర్శించారు. స్థానిక టిడిపి నాయకులతో కలిసి మేకపిల్ల చనిపోయిన విషయాన్ని స్థానిక పశువైద్యాధికారితో ఫోన్లో మాట్లాడి బాధితులకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని కోరారు. పశువులకు, మేకలకు బీమా ఇవ్వడం లేదు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండేళ్లుగా పశువులు, మేకలకు బీమా లేకుండా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందని విమర్శించారు. రైతులు పెంచుకున్న పశువులకు, మేకలకు ప్రమాద బీమా లేకుండా చేయడం దురదష్టకరమని, ఇకనైనా బీమా వర్తించేలా చూడాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, ఎం.పురుషోత్తమనాయుడు, పెద్దింటి పూర్ణచంద్రరావు, స్థానిక టిడిపి నాయకులు సింహాచలం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక సెలవుల నగదు, జిపిఎఫ్, పిఎఫ్, పిఆర్‌సి, డిఎ తదితర బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు ఎ.వెంకటరావు శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సకాలంలో డబ్బులు చేతికి రాకపోవడంతో ఆర్థికంగా ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని, పిల్లల ఆర్థిక విషయాలు, పెద్దల ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకో, పూటకో ఒక కొత్త విధానం, అకాడమీ క్యాలెండర్లో ఉన్న అంశాలపై కాకుండా ఇతరాతర విధానాలు అవలంబించడం వల్ల ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగి గందరగోళానికి గురవుతున్నారని. ఇది మానుకోవాలని హితవు పలికారు. ఫేషియల్ అటెండెన్స్‌లో ఇదివరకు ఇచ్చిన గ్రేస్ పిరియడ్ని కొనసాగించాలని, దూర ప్రాంతాల నుంచి ప్రయాణాలపై ఇతరాత్ర కారణాలపై ఆలస్యంగా వచ్చినందున ఇచ్చిన గ్రేస్ పిరియడ్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ పెద్దలకు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

11న రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఈనెల 11న శ్రీకాకుళం అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనందుని ఈ సమావేశానికి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం, జిల్లాల కార్యవర్గ సభ్యులు తప్పనిసరిగా పాల్గొనివెంకటరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దుర్గారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల డేనియల్ హాజరవుతారని తెలిపారు.

చురుగ్గా జరుగుతున్న భీంపురం వంతెన పనులు

శరవేగంగా పొక్కిరి భీంపురం వంతెన పనులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో విద్యామౌలిక సదుపాయాల కల్పన ద్వారా రూ.80లక్షల నిధులతో మంజూరైన వబ్బంగి పంచాయతీలో గల పోక్కిరి భీంపురం వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ట్రైబల్ వెల్ఫేర్ డిఇ ఎస్.సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణం వలన అటు సీతంపేట ఐటిడిఎ నుంచి శ్రీకాకుళం జిల్లాకు, అలాగే ఇటు పార్వతీపురం మన్యం జిల్లాకు ప్రయాణం సులభతరమవుతుందని దీనివల్ల సుమారు 100 గ్రామాల గిరిజన ప్రజలకు రవాణా సౌకర్యం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గతంలో వర్షాలు అధికంగా పడితే ఈ గెడ్డ ద్వారా నీరొచ్చి ప్రయాణాలు పూర్తిగా జరిగేవి కాదని అత్యవసర సమయంలో ఆరోగ్య సమస్యలతో గిరిజనులు అనేక ఇబ్బందులు పడేవారని అన్నారు. మరో 20 రోజుల్లో వంతెన నిర్మాణ పనులు పూర్తవుతాయని, ఈ గిరిజన ప్రాంత ప్రజల ప్రయాణం సులభతరం అవుతుందని అన్నారు.

విరాళంతో భవన నిర్మాణం

ప్రజాశక్తి వీరఘట్టం

మండలంలోని కడకెళ్లలో ఉప పశు వైద్య కేంద్ర భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు విరాళాలు ఎత్తుకొని పనులు చేపడుతున్నారు. శిథిలావస్థ భవనం స్థానంలో అదనపు భవనం నిర్మించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు, మండల స్థాయి పాలకులకు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదు. దీంతో ఆ గ్రామస్తులంతా కొంత విరాళాలను రూ.75వేలు సేకరించి పునాదులు వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పోగు చేసిన డబ్బుతో ఇంతవరకు పనులు చేపట్టి ఉన్నామని, దాతలు ముందుకొచ్చి విరాళం ఇస్తే మరింత త్వరితగా పనులు పూర్త కావస్తాయన్నారు.

పట్టాలు రద్దు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి- బొబ్బిలి

గొల్లపల్లి శ్రీదాడితల్లి కాలనీలో దాడితల్లి కళ్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలంలో ఇచ్చిన పొజిషన్ పట్టాలను రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు శనివారం ఆందోళన చేశారు. దాడితల్లి కాలనీలో కళ్యాణ మండపం కోసం ఉంచిన రిజర్వ్ స్థలాన్ని కాపాడాలని కోరుతూ శనివారం కళ్యాణ మండపం స్థలం నుంచి దాడితల్లి ఆలయం వరకు ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కాకల గోవిందమ్మ, మాజీ కౌన్సిలర్ కాకల వెంకటరావు, గ్రామ పెద్ద పి.ఈశ్వరరావు మాట్లాడుతూ దాడితల్లి కాలనీలో కళ్యాణ మండపం కోసం రిజర్వ్ స్థలం కేటాయిస్తే ఆస్థలంలో పొజిషన్‌లో లేనప్పటికీ రాజకీయ ఒత్తిడితో పొజిషన్ పట్టాలు ఇస్తున్నారన్నారు. కళ్యాణ మండపం స్థలంలో ఇచ్చిన పొజిషన్ పట్టాలు రద్దు చేయాలని, ఇక నుంచి పొజిషన్, ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - పాచిపెంట

మద్యం తాగొద్దని భార్య మందలించిందన్న మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలం కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాచిపెంటకు చెందిన పిన్నింటి సత్యనారాయణ (42) తరచూ మద్యం సేవిస్తున్నాడు. దీంతో భార్య భవానీ గత నెల 30న మందలించింది. మనస్థాపానికి గురైన సత్యనారాయణ పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడిన సత్యనారాయణను పాచిపెంట పిహెచ్‌లో చికిత్స చేసి అనంతరం విజయనగరం, విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. శనివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎఎస్ఐ ముసలయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.